
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
4-9-2026 (Friday) MAIN EDITION

## కేఆర్ఎంబీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చ




**అక్షరటుడే, హైదరాబాద్ :** కేఆర్ఎంబీ సమావేశంలో తాగునీటిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. 50:50 శాతం నీటివాటాలు కోరామని తెలంగాణ ఈఎన్సీ తెలిపారు. ఏపీ 66:34 శాతం డిమాండ్ చేస్తోందన్నారు. తాము దానిని వ్యతిరేకించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కేఆర్ఎంబీ పరిధిలో 142 టీఎంసీల నీరు ఉందని చెప్పారు. సాగర్‌లో తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలని ఏపీ ఈఎన్సీ కోరారు.

## తొలిరోజే రెట్టింపైన పెట్టుబడి




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ లిమిటెడ్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. మార్కెట్ నుంచి రూ.720 కోట్లు సమీకరించింది. కంపెనీ షేర్లు శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరును రూ. 429 కి విక్రయించగా.. రూ. 328 లాభంతో రూ. 757 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అంటే ఐపీవో అలాట్ అయిన వారికి లిస్టింగ్ సమయంలోనే 76.46 శాతం లాభాలు వచ్చాయి. ఆ తర్వాత కూడా షేరు జోరు కొనసాగి రూ. 908.40 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. మొత్తంగా ఒక్కరోజే షేరు ధర 111.75 శాతం పెరిగింది.

## ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి : చంద్రబాబు



**అక్షరటుడే, ఏపీ :** స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి చంద్రబాబు నాయుడు పూర్తిస్థాయిలో ప్రణాళికలు రచిస్తున్నారు. మెరుగైన స్ట్రైక్‌రేట్ సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కుట్రలు, సోషల్ మీడియా వేదికగా జరిగే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని శ్రేణులకు సూచించారు.

## నటి శృతి హాసన్‌కు హైకోర్టులో ఊరట



**అక్షరటుడే, సినిమాడెస్క్:** తన ముఖాన్ని మార్ఫింగ్ చేసి సృష్టించిన నకిలీ, అశ్లీల వీడియోలపై నటి శృతి హాసన్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. ఆమెకు అనుకూలంగా కీలక తీర్పు వెలువడింది. ఇంటర్నెట్‌లో ఆమెకు సంబంధించిన ఆ తప్పుడు కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది.

## కాంగ్రెస్ పాలన వెయ్యి పడగల మయం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన 'వంటావార్పు' నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో పరిపాలన 'వెయ్యి పడగల మయం'లా మారిందని మండిపడ్డారు.

## త్వరలో కీలక నిర్ణయం : కొండా సురేఖ



**అక్షరటుడే, వరంగల్ :** మాజీ మంత్రి కొండా సురేఖ కీలక ప్రకటన చేశారు. నిరీక్షణ ముగిసింది.. త్వరలో కీలక నిర్ణయాన్ని ప్రకటిస్తా అని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొండా సురేఖను గురువారం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. ఆమెను తొలగించడంతో పాటు ఆ శాఖలను సీఎంకు కేటాయించారు. తన తొలగింపుపై ఇప్పటికే ఆమె స్పందించారు. అన్యాయంగా పదవి నుంచి తప్పించారని, తన వివరణ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాజాగా సోషల్ మీడియా వేదికగా.. నిరీక్షణ ముగిసిందని ప్రకటించడం గమనార్హం.



# ఇస్రో 'గగన' విజయం

- నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ ఎఫ్–17 రాకెట్
- శత్రుదేశాల కదలికలపై నిఘా పెట్టనున్న ఉపగ్రహం
- శాస్త్రవేత్తలను అభినందించిన ప్రధాని

**ఇస్రో మరో ఘనత సాధించింది. జీఎస్ఎల్వీ ఎఫ్–17 రాకెట్‌ను విజయవంతం ప్రయోగించింది. శుక్రవారం తెల్లవారుజామున నిప్పులు చిమ్ముకుంటు వెళ్లిన రాకెట్ ఈవోఎస్–05 శాటిలైట్‌ను నిర్ణిత కక్ష్యలో ప్రవేశ పెట్టింది. ఈ రాకెట్ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి ఉదయం 2:55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. రాకెట్ ప్రయోగం జరిగిన కొద్దిసేపటికే, EOS-05 ఉపగ్రహం నిర్దేశిత 'సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్'లో విజయవంతంగా ప్రవేశపెట్టబడింది.**

**- అక్షరటుడే, వెబ్‌డెస్క్**

జీఎస్ఎల్వీ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ ఇటీవల చేపట్టిన ప్రయోగాలు విఫలం అయ్యాయి. ఈ క్రమంలో తాజా విజయం శాస్త్రవేత్తలకు ఊరటనిచ్చింది. అధునాతన భూ పరిశీలన ఉపగ్రహం EOS05 (జియోఇమేజింగ్ శాటిలైట్)ను GSLVF17 వాహక నౌక విజయవంతంగా, కచ్చితంగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టిందని ఇస్రో చీఫ్ డాక్టర్ వి. నారాయణన్ ప్రకటించారు. రాకెట్ మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్ మాట్లాడుతూ.. జీఎస్ఎల్వీ ద్వారా జీటీవో, లేదా సబ్‌జీటీవో కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాలలో ఇదే అత్యంత బరువైనదని పేర్కొన్నారు. ఇది 'నియర్‌రియల్‌టైమ్' (తక్షణ) ఇమేజింగ్ సామర్థ్యం కలిగిన, ప్రత్యేకమైన రూపకల్పనతో కూడిన భూ పరిశీలన ఉపగ్రహం.

### నిరంతర నిఘా

జీఎస్ఎల్వీ ఎఫ్-17 రాకెట్ EOS 05 ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తు నుండి ఈ శాటిలైట్ దేశంపై నిరంతర నిఘా ఉంచనుంది. అంతేగాకుండా శత్రుదేశాల కదలికలను సైతం పసిగడుతుంది. GSLVF17 వాహక నౌక 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువుతో భారతదేశపు అతిపెద్ద కార్యాచరణ వాహక నౌకలలో ఒకటిగా నిలిచింది. ఈ సంవత్సరంలోనే తొలి మానవరహిత గగన్‌యాన్ ప్రయోగానికి "తీవ్రమైన, క్రమబద్ధమైన కృషి" జరుగుతోందని ఇస్రో అధిపతి శుక్రవారం తెలిపారు.

### ప్రధాని అభినందనలు

ఇస్రో ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఇస్రో సాధించిన మరో అద్భుతమైన విజయం ఇది. మన దేశానికి ఇది గర్వకారణమైన క్షణం అన్నారు. ఈ ప్రయోగం భారత అంతరిక్ష రంగానికి ప్రత్యేక గుర్తింపునిచ్చే అత్యుత్తమ పనితీరు, సామర్థ్యాలకు నిదర్శనంగా అభివర్ణించారు.

### ప్రత్యేకతలు

ఇది జియోసింక్రనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే భారత తొలి డెడికేటెడ్ ఇమేజింగ్ సాటిలైట్. ఒకే ప్రాంతాన్ని తరచూ పరిశీలిస్తూ.. భూమిపై జరిగే మార్పులకు సంబంధించిన చిత్రాలను వేగంగా అందించగలదు. దీంతో దేశ సరిహద్దుల పర్యవేక్షణ, వ్యూహాత్మక అవసరాలు, అలాగే ప్రకృతి విపత్తుల సమయంలో పరిస్థితులను త్వరగా అంచనా వేయడంలో కీలకంగా ఉపయోగపడనుంది. వ్యవసాయం, సహజ వనరుల పరిశీలన, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వంటి రంగాలకు కూడా EOS05 సమాచారం అందించనుంది.

## ఇరాన్‌ను కంట్రోల్ చేసేందుకు చాలా మార్గాలున్నాయి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం లేదు. ఇరాన్‌పై కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ఇరాన్‌పై ఒత్తిడికి చాలా ఆప్షన్స్ ఉన్నాయని వాన్స్ అన్నారు. ఆర్థిక, సైనిక, దౌత్యపరమైన ఒత్తిడి ప్రయోగించవచ్చని తెలిపారు. రహస్య చర్యల ద్వారా ఒత్తిడి చేసే ఆప్షన్ ఉందన్నారు. ఇంధన సంక్షోభాన్ని నివారించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. హోర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను అడ్డుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్‌ను కంట్రోల్ చేసేందుకు రహస్య చర్యలతో సహా చాలా మార్గాలు ఉన్నాయని తెలిపారు.



## కర్రలతో కొట్టుకున్న జేఎన్‌టీయూ విద్యార్థులు

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో విద్యార్థులు కర్రలతో కొట్టుకున్నారు. క్యాంపస్ బయట రెండు హాస్టళ్లకు చెందిన విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో పోలీసులు 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. యూనివర్సిటీలో గురువారం రాత్రి తీజ్ వేడుకలు నిర్వహించారు. ఈ సమయంలో ఓ విద్యార్థి అమ్మాయి పట్ల అనుచితంగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో గొడవ ప్రారంభం అయింది. వాగ్వాదం తీవ్రం కావడంతో రెండు హాస్టళ్ల విద్యార్థులు పరస్పరం దాడి చేసుకున్నారు.

## 9 రోజుల తర్వాత ప్రాణాలతో..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌లో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. త్రిశూలిలో శిథిలాల కింద కూరుకుపోయిన ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుండి తాజాగా ఇద్దరిని సజీవంగా బయటకు తీశారు. దీంతో మరికొందరు లోపల చిక్కుకుపోయి ఉండవచ్చనే ఆశలు బలపడ్డాయి. ఆ ఇద్దరిని కబీర్ మహర్జన్, సంజయ్ షాగా గుర్తించినట్లు నేపాల్ హోం మంత్రి సుడాన్ గురుంగ్ తెలిపారు.





## స్తంభాన్ని ఢీకొన్న విమానం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** శ్రీనగర్ ఎయిర్ పోర్టులో పెను ప్రమాదం తప్పింది. ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విమానం ముందు భాగం దెబ్బతింది. నవీ ముంబై నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఈ విమానం ఉదయం 9 గంటలకు విమానాశ్రయంలో ఆగుతుండగా ప్రమాదానికి గురైంది. ఫ్లైట్ సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత, పార్కింగ్ చేస్తుండగా ఒక పార్కింగ్ స్టాండ్ స్తంభాన్ని ఢీకొందని విమానయాన సంస్థ ఒక తెలిపింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారు.


## లవర్‌కు ఐఫోన్ గిఫ్ట్ ఇచ్చేందుకు గంజాయి రవాణా

**అక్షరటుడే, ఖమ్మం :** తన ప్రియురాలికి బర్త్ డే సందర్భంగా ఐఫోన్ గిఫ్ట్ ఇచ్చేందుకు ఓ యువకుడు గంజాయి రవాణాకు పాల్పడ్డాడు. ప్రియురాలితో కలిసి బైక్‌పై గంజాయి తీసుకొస్తూ పోలీసులకు చిక్కాడు. పెద్దపల్లికి చెందిన మిత్ర చైతన్య (21), హేమలత (20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. నిందితులు ఒడిశా నుండి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా 'ఈగిల్ ఫోర్స్', వైరా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బర్త్ డే సందర్భంగా తన ప్రియురాలికి ఐఫోన్ కొనివ్వాలనే ఉద్దేశంతో ఒడిశా వెళ్లి 12 కిలోల గంజాయిని తీసుకు వస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు.



## ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌పై వేటు

**అక్షరటుడే, ఏపీ :** స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.50 లక్షల విలువైన ఈ సిగరెట్లను ఓ అధికారి విక్రయించాడు చెన్నై నుంచి అన్నమయ్య జిల్లాలోని రాయచోటికి ఈ సిగరెట్ల సరుకును అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఏపీలోని భాకరాపేట అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద అటవీ అధికారులు ఈ సరుకును అడ్డుకుని, సుమారు రూ. 50 లక్షల విలువైన సిగరెట్ల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్వాధీన ప్రక్రియను ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణే నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న సరుకును అధికారికంగా భద్రపరచడానికి బదులుగా రహస్యంగా ఇతరులకు ఆయన విక్రయించాడు. దీంతో ఆయనను తాజాగా సస్పెండ్ చేశారు.



## గిగ్‌వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఆటో, క్యాబ్, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

